క్లుప్తంగా

రహదారి భద్రత సూచనలు పాటించాలి



ఉంగుటూరు: వాహన చోదకులు రహదారి భద్రత సూచనలు పాటించాలని ఆత్కూరు ఎస్‌ఐ చావా సురేష్ సూచించారు. రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా పొట్టిపాడు టోల్‌గేట్ ప్లాజా వద్ద ఆత్కూరు పోలీసులు ఆదివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. హెల్మెట్, సీట్ బెల్ట్, లైసెన్స్, ఫిట్నెస్ సర్టిఫికెట్లు తనిఖీ చేశారు. అవి లేనివారికి జరిమానా విధించారు. వాహన చోదకులకు రహదారి భద్రత సూచనలు వివరించారు.

రంగవల్లుల పోటీల్లో విజేతలకు బహుమతులు



రామవరప్పాడు: మన సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక రంగవల్లులని రామవరప్పాడు మాజీ ఉప సర్పంచ్ కొల్లా ఆనంద్ కుమార్ అన్నారు. రామవరప్పాడు ఫ్లైఓవర్ సమీపంలో 'మిఠాయి చిరుతిండి' ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. మహిళలకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. ఉమ్మడి కృష్ణా జిల్లాతో పాటు నల్గొండ, గుంటూరు జిల్లాల నుంచి మహిళలు ఉత్సాహంగా ఈ పోటీల్లో పాల్గొన్నారు. తోటకూర జ్యోతికి ప్రథమ బహుమతిగా రూ.25 వేలు, ద్వితీయ విజేత తానా నాగలక్ష్మికి రూ.15 వేలు, మూడో బహుమతి విజేత టి.మహాలక్ష్మికి రూ.10 వేలు, నాలుగో విజేత టి.మానసకు రూ.5 వేల వంతున అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్నంగి సత్యనారాయణ, కొంగన రవి, కళ్లెపల్లి సాయి రామరాజు, నభిగాని కొండ తదితరులు పాల్గొన్నారు.

రూ.3 లక్షల విలువైన కోడి పుంజులు చోరీ

ఉంగుటూరు: మండలంలోని తేలప్రోలులో రూ.3 లక్షల విలువ కలిగిన కోడి పుంజులు చోరీకి గురైన సంఘటన ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అదే గ్రామానికి చెందిన మణికంఠరెడ్డి మరికొందరు స్నేహితులతో కలిసి కోళ్లు పెంచుతున్నారు. ఆదివారం తెల్లవారు జామున కోళ్లు ఉన్న ప్రాంతానికి వెళ్లి చూడగా 15 కోడి పుంజులు కనిపించలేదు. సమాచారం తెలుసుకున్న ఆత్కూరు ఎస్‌ఐ సురేష్ సంఘటన స్థలానికి వెళ్లి అక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమేరాను పరిశీలించారు. గుర్తు తెలియని వ్యక్తి ముఖానికి మంకీక్యాప్ ధరించి కోళ్లను తరలిస్తుండటాన్ని గుర్తించారు. ఈ ఘటనపై పోలీసులు ఆరా తీస్తున్నారు. విచారణ చేస్తున్నామని కేసు నమోదు చేయలేదని ఎస్‌ఐ చెప్పారు.

జూదరులకోసం చకచకా రోడ్డు నిర్మాణం



కంకిపాడు: గుంతల రోడ్డుపై ఎక్కడా లేని ప్రేమ ముంచుకొచ్చింది. సంక్రాంతి బరుల వద్దకు జనం వస్తేనే బరులు విజయవంతం అవుతాయి. దీంతో నిర్వాహకులు రోడ్డు మరమ్మతులను ఆఘమేఘాల మీద చేపట్టారు. ఈడుపుగల్లు- ఉప్పలూరు వద్ద కంకిపాడు- గన్నవరం రోడ్డును కలుపుతూ ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు అధ్వానంగా ఉంది. అడుగుకో గొయ్యి, కోతకు గురైన మార్జిన్‌లతో ప్రమాదకరంగా ఉంది. ఈ మార్గంలో ప్రయాణించటం అంటేనే వాహనదారులు, ప్రజలు భయపడుతున్న పరిస్థితి. ప్రయాణం నరకప్రాయంగా తయారైంది. కొన్ని సంవత్సరాలుగా ప్రజలు రహదారి కష్టాలు ఎదుర్కొంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎన్నికల కోడ్ అమలు నాటికి రోడ్డు అభివృద్ధికి రూ.19 కోట్లు మంజూరైనా రోడ్డు అభివృద్ధిని పట్టించుకోలేదు. తాజాగా సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామంలో సంక్రాంతి బరి ఏర్పాటు చేశారు. భారీ సెట్టింగులతో సంక్రాంతి బరి సిద్ధమవుతోంది. తెలుగు రాష్ట్రాలతో పాటుగా అనేక ప్రాంతాల నుంచి పందెంరాయుళ్లు, వీక్షకులు ఇక్కడికి తరలివస్తుంటారు. రోడ్డు అధ్వానంగా ఉండటంతో పందెంరాయుళ్లు, వీక్షకులు ఇతర ప్రాంతాలకు తరలివెళ్లిపోయే పరిస్థితి ఉందని భావించిన నిర్వాహకులు రోడ్డు మరమ్మతులను చేపట్టారు. ఇప్పటికే గుంతలను సరిచేసి ఒక విడత రోలింగ్ చేశారు. గోతులను పూడ్చుతూ, రోడ్డు మార్జిన్‌లలో వాహనాలు ప్రమాదాలకు గురికాకుండా కోతకు గురైన మార్జిన్‌లను కంకరుతో సరిచేస్తూ రోడ్డు పనులు చకచకా పూర్తి చేస్తున్నారు.

కాలు దువ్వుతున్న పందెం కోళ్లు

- జూద శిబిరాలకు అడ్డాగా గన్నవరం నియోజకవర్గం
- గత సంప్రదాయాలకు తిలోదకాలిచ్చిన కొందరు కూటమి నేతలు
- గ్యాలరీలు, కూలర్లు, ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు
- అక్కడక్కడా టెంట్లు పడవేసి మమ అనిపించిన పోలీసులు



సూరంపల్లిలో ఏర్పాటు చేసిన జూద శిబిరం

గన్నవరం: సంక్రాంతి సంబరాల పేరుతో గన్నవరం నియోజకవర్గాన్ని జూద శిబిరాలకు అడ్డాగా కూటమి ప్రభుత్వ నేతలు మార్చివేశారు. నియోజకవర్గ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా భారీ స్థాయిలో జూద శిబిరాలను ఏర్పాటు చేశారు. కోడి పందేల బరులతో పాటు పేకాట, కేసినోల నిర్వహణకు హైటెక్ హంగులతో శిబిరాలను సిద్ధం చేశారు.

గ్యాలరీలు, కూలర్లు, ఎల్‌ఈడీ స్క్రీన్లు..

నియోజకవర్గంలో రామవరప్పాడు, ఎనికేపాడు, సూరంపల్లి, అంపాపురంలో పెద్ద ఎత్తున్న జూద శిబిరాలను పండుగ మూడు రోజులు నిర్వహించనున్నారు. ఈ శిబిరాల్లో వీఐపీల కోసం ప్రత్యేక గ్యాలరీలు, కూలర్లు, ఎల్‌ఈడీ స్క్రీన్లు, పేకాట ఆడేందుకు ప్రత్యేక ఏసీ రూమ్‌లను ఏర్పాటు చేశారు. మందు, బిర్యాని స్టాల్స్‌ను కూడా ఈ శిబిరాల వద్దే సిద్ధం చేస్తున్నారు.

విస్తృత ప్రచారం..

కేసినో నిర్వాహణ కోసం ఇతర రాష్ట్రాల నుంచి వ్యక్తులను కూడా తీసుకువచ్చినట్లు తెలుస్తోంది. నందమూరు, గన్నవరం, కె. సీతారామపురం, వీఎన్.పురంతో పాటు గ్రామగ్రామాన పేకాట, కోడి పందేలు బరులను నిర్వహించేందుకు సన్నాహాలు పూర్తిచేశారు. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు ఆశీస్సులతో ఈ జూద శిబిరాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బ్యానర్లు ఏర్పాటు చేయడంతో పాటు సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేసుకుంటున్నారు. ఇప్పటికే పోలీస్ అధికారులనుంచి జూద శిబిరాల నిర్వాహకులు అనధికార అనుమతులు పొందినట్లు సమాచారం.

- అంపాపురంలో ఎమ్మెల్యే యార్లగడ్డ అనుచరుల ఆధ్వర్యంలో కోడి పందేల కోసం ఒక పెద్ద బరిని, మరో నాలుగు చిన్న బరులను సిద్ధం చేశారు. పేకాట, కేసినో కోసం ప్రత్యేక టెంట్‌లను ఏర్పాటు చేశారు.
- సూరంపల్లిలో టీడీపీ, జనసేన నేతలు ఉమ్మడిగా భారీ జూద శిబిరం సిద్ధం చేశారు. కోడి పందేలు, పేకాటతో పాటు కేసినో తరహా ఆటలు ఆడేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కోడి పందేలు వీక్షించేందుకు గ్యాలరీలను సిద్ధం చేశారు.
- విజయవాడ రూరల్ మండలంలోని రామవరప్పాడు, ఎనికేపాడు గ్రామాల్లో గతంలో ఎప్పుడూ లేని విధంగా భారీ ఎత్తున్న టీడీపీ నేతలు జూద శిబిరాలను ఏర్పాటు చేశారు. ఇక్కడ హైటెక్ హంగులతో ఏర్పాట్లు చేయడం విశేషం.

రోజుకు రూ.10 కోట్లు చేతులు మారతాయని అంచనా

హనుమాన్ జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం అంపాపురంలో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న రియల్ ఎస్టేట్ వెంచర్‌లో గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అనుచరగణం భారీ జూదం శిబిరం ఏర్పాటు చేశారు. రోజుకూ కనీసం రూ.10 కోట్ల మేర చేతులు మారుతాయని అంచనా, జూద ప్రియులను ఆకర్షించేందుకు ఛీర్ గార్ల్స్‌ను కూడా నిర్వాహకులు ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. దాదాపు 20 ఎకరాల సువిశాల ప్రాంగణంలో కోడి పందేలు, పేకాటతో పాటుగా గుండాట, కాయ్ రాజా కాయ్ వంటి జూదాలు కూడా నిర్వహించ నున్నారు. శిబిర ప్రాంగణంలో అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేశారు.



అంపాపురంలో సిద్ధమైన కోడి పందేల బరి

నామమాత్రపు చర్యలు..



రామవరప్పాడు బరి వద్ద టెంట్లు తొలగిస్తున్న పోలీసులు

రామవరప్పాడు: సంక్రాంతి సంబరాల మాటున విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు, ఎనికేపాడు గ్రామాల్లో నిర్వహిస్తున్న కోడి పందేల బరులపై పోలీసులు ఆదివారం నామమాత్రపు చర్యలు తీసుకుని మమ అనిపించారు. రామవరప్పాడు ఫ్లైఓవర్ సమీపంలో, ఎనికేపాడు హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో ఏర్పాటు చేసిన బరుల వద్ద పటమట సీఐ వి.పవన్ కిషోర్ ఆధ్వర్యంలో పోలీసుల బృందం కొద్ది సేపు హడావుడీ చేసి రెండు, మూడు టెంట్లు తొలగించారు. బరులను ట్రాక్టర్లతో పైపైన దున్నించి చేతులు దులుపుకున్నారు. రామవరప్పాడు, ఎనికేపాడు గ్రామాల్లో భారీ సెట్టింగులతో బరులు సిద్ధం చేసిన విషయం తెలిసిందే. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో బరుల వద్ద వేసిన టెంట్లను తొలగించారు. కాగా బరుల వద్ద భారీ సెట్టింగులు, కోళ్ల పందేల రింగుల జోలికి వెళ్లలేదు. పోలీసులు అక్కడి నుంచి వెళ్లగానే నిర్వాహకులు మరలా టెంట్లు వేసుకోవడం గమనార్హం.

నిర్వాహకులకు నోటీసులు..

గన్నవరం రూరల్: మండలంలోని సూరంపల్లిలో సంప్రదాయ ముసుగులో కోడి పందేలు వేసేందుకు పెద్ద పెద్ద గుడారాలు నిర్మించారు. అక్కడ కోట్లలో పందేలు జరుగుతాయని జోరుగా ప్రచారం జరుగుతోంది. క్యాసినో తరహాలో ఏర్పాట్లు చేసినట్లు చెబుతున్నారు. పందెం రాయుళ్లను ఆకర్షించే విధంగా స్వాగత బ్యానర్‌లు ఏర్పాటు చేశారు. ఒక పక్క కోడి పందేలు వేయవద్దంటూ అధికారుల ప్రచారం చేస్తుండగా..మరోవైపు తెలుగు తమ్ముళ్లు కోడిపందేల పనుల్లో బిజీబిజీగా ఉన్నారు. గోపవరపుగూడెం, పురుషోత్తపట్నం రైల్వే గేటు సమీపంలో, చిన అవుటపల్లి, తెంపల్లి గ్రామాల్లో కూడా బరులు సిద్ధం చేశారు. ఆత్కూరు ఎస్ఐ సురేష్ చినఅవుటపల్లి, తెంపల్లి గ్రామాల్లో పర్యటించి నిర్వాహకులకు నోటీసులు అందజేశారు. యువత జూదాలకు దూరంగా ఉండాలని అవగాహన కల్పించారు.



తెంపల్లిలో నిర్వాహకులకు నోటీసు అందజేస్తున్న ఎస్ఐ సురేష్

జూదాలు చట్టరీత్యా నేరం

ఉంగుటూరు: సంక్రాంతిని సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని, జూదాలకు పాల్పడటం చట్టరీత్యనేరమని ఆత్కూరు ఎస్‌ఐ సురేష్ హెచ్చరించారు. ఆత్కూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని గన్నవరం మండలం చిన్న అవుటపల్లి, తెంపల్లి గ్రామాల్లో కోడిపందేల శిబిరాల నిర్వాహకులకు పోలీసులు ఆదివారం నోటీసులు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ జూద శిబిరాలు ఏర్పాటు చేసిన వారికి షామియానాలు, మైక్‌సిస్టమ్ ఇచ్చి సహకరించిన వారిపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే 60 మందిని గుర్తించి స్థానిక తహసీల్దార్ వద్ద బైండోవర్ చేసినట్లు తెలిపారు.

ఉంగుటూరులో 15న గోపూజ

ఉంగుటూరు: ఉంగుటూరులోని శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఈ నెల 15న తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో 'మన గుడి' కార్యక్రమలో భాగంగా గోపూజ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సీవీకే ప్రసాద్ తెలిపారు. ఉదయం 9.30 గంటలకు భక్తుల చేత గోపూజ నిర్వహిస్తారని చెప్పారు. కనుమ పండుగ, గోపూజ విశిష్టతను కలవలపల్లి బాలసుబ్రహ్మణ్యం వివరిస్తారని అన్నారు.

నేటి నుంచి తరిగొప్పల బస్ సర్వీస్ ప్రారంభం

గన్నవరం: స్థానిక ఆర్టీసీ డిపో పరిధిలోని ఉంగుటూరు మండలం తరిగొప్పుల నుంచి తెన్నేరు మీదుగా విజయవాడ కాళేశ్వరరావు మార్కెట్‌కు సోమవారం నుంచి నూతన బస్ సర్వీస్‌ను నడపనున్నట్లు ఆర్టీసీ డీఎం పి.శివాజి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సు ప్రతిరోజు ఉదయం 6.30, మధ్యాహ్నం 1.15 గంటలకు తరిగొప్పులలో బయలుదేరి మారేడుమాక, తెన్నేరు, గూడవల్లి, రామవరప్పాడు, గుణదల మీదుగా మార్కెట్‌కు చేరుకుంటుందన్నారు. ఇదే బస్సు విజయవాడ మార్కెట్ నుంచి సాయంత్రం 4.45 గంటలకు బయలుదేరి 6.15కు తరిగొప్పుల చేరుకుంటుంది.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తికి గాయాలు

పెనమలూరు: విజయవాడ- అవనిగడ్డ కరకట్టపై జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు అవ్వటంతో పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కానూరుకు చెందిన కోసూరు అశోక్‌కుమార్ ఆటోనగర్‌లో వెల్డర్‌గా పని చేస్తాడు. అతను ఈ నెల 10న స్వగ్రామం నాగాయలంకకు వెళ్లాడు. తిరిగి ఆటోనగర్‌లో పనికి నాగాయలంక నుంచి బైక్‌పై కరకట్టమీదగా వస్తుండగా పెదపులిపాక వద్ద విజయవాడ వైపు నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. గాయపడిన అతనిని విజయవాడ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): తాపీ పనులకు నగరానికి వచ్చిన వ్యక్తి అదృశ్యమైన ఘటనపై గవర్నర్‌పేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ప్రకాశం జిల్లా దర్శి మండలం పెద్ద ఉయ్యాలవాడకు చెందిన ఆవులూరి చిన్నా తాపీ కార్మికు డు. విజయవాడ పాత ప్రభుత్వాస్పత్రి రోడ్డులో బిల్డింగ్ పనులు చేస్తున్నాడు. ఈనెల 6న టీ తాగడానికని వెళ్లి తిరిగి రాలేదు. దీనిపై కేసు నమోదు చేశారు.

ఉత్సాహంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు

పాయకాపురం(విజయవాడరూరల్): సంక్రాంతి సంబరాలు అంబాపురంలో ఆదివారం అంబరాన్నంటాయి. పండుగ ప్రాముఖ్యతను తెలియజేస్తూ ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. చిన్నారుల సంప్రదాయ నృత్యాలు, గీతాలాపనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సంక్రాంతిని పురస్కరించుకొని నిర్వాహకులు మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సంబరాలలో వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సంస్కృతి, "సంప్రదాయాలకు మన పండుగలు ప్రతీకలని పేర్కొన్నారు. అనంతరం ముగ్గుల పోటీల్లో విజేతలకు మల్లాది విష్ణు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అనంతరం నిర్వాహకులు మల్లాది విష్ణుని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సాయి, మహేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు

ఘనంగా వివేకానంద జయంతి

పెనమలూరు: కానూరులో వివేకానంద జయంతి ఆదివారం ఘనంగా చేశారు. అశోక్ జిమ్‌లో స్వామి వివేకానంద చిత్రపటానికి గన్నవరం సీఐ పెద్దిరాజు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. యువజన దినోత్సవం సందర్భంగా క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందజేశారు. నేటి యువత వివేకానందను స్ఫూర్తిగా తీసుకోవాలని సీఐ పెద్దిరాజు అన్నారు. యువత జాతీయ శక్తిగా ఎదగాలన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ కార్యదర్శి తాళ్లూరి అశోక్, క్రీడాకారులు పాల్గొన్నారు.

వీఆర్‌లో..

కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో ఆదివారం యువజనోత్సవం ఘనంగా చేశారు. స్వామి వివేకానందకు ఘన నివాళులర్పించారు. నెహ్రూ యువకేంద్రం, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర, ఎన్‌సీసీ ఆఫీసర్ సుదర్శన్ పలువురు పాల్గొన్నారు.



కానూరులో వివేకానంద జయంతి కార్యక్రమంలో క్రీడాకారులు

గొడవర్రులో వైద్య శిబిరం ఏర్పాటు

- ఇంటింటి సర్వేతో బాధితుల గుర్తింపునకు చర్యలు
- దోమల నిర్మూలనకు ప్రత్యేక డ్రైవ్

సాక్షి ఎఫెక్ట్

కంకిపాడు: ఎట్టకేలకు వైద్య ఆరోగ్య శాఖ కదిలింది. జ్వరం, కీళ్ల నొప్పులు, వాపులు, దద్దుర్లుతో బాధ పడుతున్న బాధితులకు అవసరమైన వైద్య సేలు యుద్ధ ప్రాతిపదిక అందిస్తున్నారు. మంచం పట్టిన గొడవర్రు శీర్షికన ఈనెల 11న 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి వైద్య ఆరోగ్య శాఖ అధికారులు స్పందించారు. గ్రామంలో శనివారం నుంచి గ్రామంలో వైద్య శిబిరాలను నిర్వహిస్తోంది. ప్రధానంగా బీసీ ఏరియాలో జ్వర పీడితులు ఉన్న ప్రాంతాల్లో ఇంటింటి సర్వే చేపట్టారు. వివరాలు సేకరించారు. నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో పంచాయతీ భాగస్వామ్యంతో దోమల నిర్మూలన మందును పిచికారీ చేయించారు. అవగాహన కల్పించి, మందులు అందించారు. జ్వరం, కీళ్లనొప్పులు, వాపులు, దద్దుర్లు, ఇతర సమస్యలతో బాధపడుతున్న వారి రక్త నమూనాలను సేకరించి ల్యాబ్‌కు తరలించారు. గ్రామంలో మలేరియా, డెంగీ, ఇతర వైరల్ జ్వరాలు లేవని వైద్యాధికారి డాక్టర్ సుధాప్రసూజ తెలిపారు.



వైద్య శిబిరంలో రోగులకు వైద్య పరీక్షలు

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



వీకేఆర్‌లో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు



పోరంకిలో సన్మానం పొందిన గురువులతో పూర్వ విద్యార్థులు

గన్నవరం: మండలంలోని కేసరపల్లి శివారు వీకేఆర్ కళాశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఉత్సాహంగా జరిగింది. కళాశాలలో 1962 నుంచి 2024 వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనానికి తరలివచ్చారు. ఒకే వేదికపై స్నేహితులను, గురువులను కలుసుకుని ఆనందంగా గడిపారు. పూర్వ విద్యార్థులు బ్యాచ్‌ల వారీగా తమ అనుభవాలను, కళాశాలతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ప్రతి సంవత్సరం పూర్వ విద్యార్థులందరూ ఒకే చోట కలుసుకునే విధంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్న ఓల్డ్ స్టూడెంట్ కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. తొలుత కళాశాల వ్యవస్థాపకులైన వేములపల్లి కోదండరామయ్య, లక్ష్మీఅన్నపూర్ణమ్మ దంపతులకు, మాజీ ప్రిన్సిపాల్ తాతినేని శ్రీనివాసరావు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎంవీఎల్.ప్రసాద్, ఎన్‌బీ.మురళీకృష్ణ మాట్లాడుతూ..ఈ ప్రాంత విద్యాభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని వేములపల్లి కోదండరామయ్య ఈ కళాశాలను స్థాపించారని చెప్పారు. కళాశాల అభివృద్ధికి, ఇక్కడ చదువుకునే పేద విద్యార్థులకు చేయూతనిచ్చేందుకు తోడ్పాటునందించాలని కోరారు. విశ్రాంత అధ్యాపకులు ఎం.విజయకుమార్, సీతారామస్వామి, ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు, గాంధీబాబు, కమిటీ కోశాధికారి రాంబాబు, సభ్యులు కే శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పెనమలూరు: పోరంకిలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరిగింది. గ్రామంలోని విజ్ఞాన్ భారత్ పాఠశాలలో చదివిన 1999- 2000 సంవత్సరం పదో తరగతి పూర్వ విద్యార్థులు సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించారు. దేశంలో వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు చాలా సంవత్సరాల తరువాత కలవటంతో ఆప్యాయతతో పలకరించుకున్నారు. ఈ సందర్భంగా గురువు ప్రొఫెసర్ కొడాలి రామశేషాద్రిరావును, ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

కంకిపాడు: పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఉత్సాహంగా సాగింది. ప్రొద్దుటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1988వ సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలను సందర్శించి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆత్మీయంగా పలకరించుకుంటూ యోగ క్షేమాలు తెలుసుకున్నారు. గతస్మృతులను జ్ఞాపకం చేసుకున్నారు. కార్యక్రమాన్ని పూర్వ విద్యార్థులు ఈడా నాగభూషణం, కె.పూర్ణ, జి.రవికుమార్, వాసుదేవరెడ్డి పర్యవేక్షించారు.



ప్రొద్దుటూరులో సమావేశమైన పూర్వ విద్యార్థులు

జీతాలిచ్చి పండుగ చేసుకోనివ్వండి

- నిరసన కార్యక్రమంలో వ్యాన్ డ్రైవర్లు
- ఎమ్మెల్యే, కమిషనర్ మాట నిలబెట్టుకోవాలని వినతి

పెనమలూరు: తాడిగడప మున్సిపాలటీలో తడి చెత్త-పొడిచెత్త తరలించే వ్యాన్ డ్రైవర్లకు గత మూడు నెలలుగా జీతాలు ఇవ్వటం లేదని కార్మికులు చేపట్టిన సమ్మెకు పలు సంఘాలు మద్దతు పలికాయి. మున్సిపాలిటీలో పని చేస్తున్న 42 మంది వ్యాన్ డ్రైవర్లకు మూడు నెలలుగా జీతాలు ఇవ్వటం లేదని చేస్తున్న సమ్మె ఆదివారం మూడో రోజుకు చేరింది. వీరి సమ్మెకు ఐద్వా మహిళా సంఘం, యువజన సంఘాలు, సీఐటీయూ, సీపీఎం, ప్రజానాట్య మండలి పూర్తి మద్దతు ప్రకటించాయి. పండుగ సందర్భంగా వ్యాన్ డ్రైవర్ల కుటుంబాలు పస్తులు ఉండకుండా వెంటనే జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే, మున్సిపాలిటీ కమిషనర్ డ్రైవర్లకు ఇచ్చిన మాట తప్పారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నేతలు ఉప్పాడ త్రిమూర్తి, షేక్ కాశిం, షేక్ మస్తాన్‌వలి, ఐద్వా నేతలు పుసునూరి పాతాళ లక్ష్మి, షేక్ ఒలేమా, నేతలు నరేంద్ర, ప్రసాద్, శ్రావణ్ పలువురు పాల్గొన్నారు.



యనమలకుదురులో నిరసన తెలుపుతున్న వ్యాన్ డ్రైవర్లు

సంక్రాంతి సెలవులతో పెరిగిన ట్రాఫిక్

పెనమలూరు: విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారి బందరు రోడ్డుపై ఆదివారం భారీగా టాఫిక్ ఏర్పడింది. సంక్రాంతి పండుగ సందర్భంగా కారులు, ఇతర వాహనాల్లో రావడంతో ఒక్కసారిగా ట్రాఫిక్ పెరిగింది. దీంతో మండల పరిధిలో ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి. విజయవాడ మీదగా తూర్పు కృష్ణ, దివిసీమ, ఇతర ప్రాంతాలకు వెళ్లటానికి పెనమలూరు మండల పరిధిలో ఉన్న జాతీయ రహదారిపై నుంచి ప్రయాణం చేయాలి. ఇక్కడ సాధారణ రోజుల్లోనే ట్రాఫిక్ ఇబ్బందులు ఉంటాయి. సంక్రాంతి పండుగ సందర్భంగా వరుస సెలవులు రావటంతో తెలంగాణ, ఇతర ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు బయలుదేరటంతో ఒక్కసారిగా బందరు రోడ్డుపై ట్రాఫిక్ సమస్య తలెత్తింది.

ప్రత్యేక చర్యలు శూన్యం..

ట్రాఫిక్ సమస్య లేకుండా పోలీసులు ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు ఏవీ చేపట్టలేదు. ఈ కారణంగా కామయ్యతోపు, తాడిగడప జంక్షన్, పోరంకి, పెనమలూరు సెంటర్ ప్రాంతాల్లో జాతీయ రహదారిపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఆటోనగర్ టెర్మినల్ నుంచి గోసాల సెంటర్ వరకు వెళ్లటానికి చాలా సమయం పట్టింది. ఇదేసమయంలో కాలేజీ విద్యార్థులకు అవుటింగ్ కూడా ఇవ్వటంతో విద్యార్థులు గుంపులు గుంపులుగా రోడ్లపైకి వచ్చారు. పండుగ ముగిసిన తరువాత కూడా ఇదే పరిస్థితి తలెత్తకుండా పోలీసులు ముందస్తు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



పోరంకి వద్ద జాతీయ రహదారిపై నిలిచిన వాహనాలు

మహిళపై దాడి.. కేసు నమోదు

పెనమలూరు: పోరంకిలో ఓ మహిళ, ఆమె కుటుంబ సభ్యులపై దాడి చేసిన పలువురు వ్యక్తులపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం.. ఒంటిపాక లావణ్య ఆమె కుటుంబ సభ్యులు పోరంకి కృష్ణవేణి స్కూల్ రోడ్డులో ఉంటున్నారు. అయితే ఆమె ఇంటి ఎదురుగా ఉండే రాయన అనూష తరచుగా లావణ్యతో అకారణంగా గొడవపడుతుంది. లావణ్యకు లేని పోని సంబంధాలు అంటకట్టి లావణ్య విజయవాడలో పని చేస్తున్న షోరూమ్ వద్ద అల్లరి చేయసాగింది. కాగా శనివారం ఉదయం లావణ్య ఇంటి వద్ద ఉన్న సమయంలో అనూష, ఆమె భర్త జ్ఞానేంద్ర, బంధువులు పి.వేణు, పి.సురేష్ వచ్చి బూతులు తిడుతూ లావణ్య, ఆమె కుటంబ సభ్యులపై దాడి చేశారు. ఈ ఘటనపై బాధితురాలు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

దళితుల మధ్య చిచ్చుపెట్టేందుకు బీజేపీ యత్నం

కృష్ణలంక(విజయవాడతూర్పు): దళితుల మధ్య చిచ్చుపెట్టి వైషమ్యాలను పెంచడానికి బీజేపీ యత్నిస్తోందని దళిత శోషణ్ ముక్తి మంచ్(డీఎస్ఎంఎం) జాతీయ నాయకుడు, కేవీపీఎస్ ఉపాధ్యక్షుడు వి.శ్రీనివాసరావు ఆరోపించారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ భవన్‌లో కేవీపీఎస్ 2025 డైరీని ఆదివారం ఆవిష్కరించారు. జి.నటరాజ్, జి.క్రాంతికుమార్, చింతల శ్రీనివాస్, జి.అరుణమ్మ పాల్గొన్నారు.